క్లుప్తంగా

గోహత్య నిషేధ చట్టాన్ని అమలు చేయాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

దేవరపల్లి: గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని తిరుమల నాథుని విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సత్య నారాయణకు వినతిపత్రం అందజేశారు. గోవులను కాపాడుకోవాలనే ఉద్దేశంతో 1977లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన గోరక్షణ చట్టం అమలు కావడం లేదని ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వీహెచ్‌పి ప్రతినిధి నరసింహప్రసాద్ మాట్లాడుతూ, విచ్చలవిడిగా గోవధ జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని గోవధ శాలలను తక్షణం మూసివేయాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలో ఉన్న గోచర భూములకు విముక్తి కలిగించాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో గోశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. గుర్తింపు పొందిన గోశాలలకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

పెరవలి: విజ్ఞాన గనులైన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రీసోర్స్‌పర్సన్ ఎస్.వుష్పావతి అన్నారు. ముక్కామల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా గురువారం ఇంగ్లిష్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఇంగ్లిష్‌పై చిన్నప్పటి నుంచి అవగాహన ఉంటే భవిష్యత్తులో ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు ఏకాగ్రత పెరగాలంటే తప్పనిసరిగా యోగా చేయాలని, అందుకు ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని యోగా మాస్టారు కరుటూరి విశ్వనాథం తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి యు.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా జగన్నాథరావు బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ జగన్నాథరావుకు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

నిడదవోలు రూరల్: కొత్త నిడదవోలు ఎంపీడీఓగా వీఎస్‌వీఎల్ జగన్నాథరావు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం జగన్నాథరావు ఎంపీడీఓ కార్యాలయ ఏవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా పనిచేసిన డి.లక్ష్మీనారాయణ ఈఓపీఆర్డీగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జగన్నాథరావును ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నాగనాథ్, జూనియర్ అసిస్టెంట్ మనోజ్, కార్యాలయ సిబ్బంది అంజిబాబు, నాగరాజు, ఎన్.శ్రీను తదితరులు అభినందనలు తెలిపారు.

వైద్యానికి ఆర్థిక సాయం



మహాలక్ష్మికి ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

తాళ్లపూడి(కొవ్వూరు): ధర్మవరం గ్రామానికి చెందిన పల్లి కనకదుర్గ మహాలక్ష్మి రక్తహీనత, ఫిట్స్ వ్యాధితో బాధపడుతోంది. రెండు నెలల పాపతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మండల ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, చిడిపి దేవోక్తి సోషల్ సర్వీసు అబెద్నగో కలిసి వాట్సాప్‌లో తమ మిత్రులు, సహ ఉద్యోగులు, బంధువుల నుంచి రూ.21,400 సేకరించారు. ఈ నగదును గురువారం మహాలక్ష్మికి అందజేశారు. తాళ్లపూడి మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు రూ.6 వేలతో పాటు పలువురు సాయం అందించారు.

రేషన్ పంపిణీ తనిఖీ



తాళ్లపూడిలో వృద్ధురాలి ఇంటి వద్ద సరకుల పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీవో

తాళ్లపూడి: వృద్ధులు ఇబ్బందులు పడకుండా ప్రతి నెలా ఇంటి వద్దే రేషన్ సరకులు అందజేస్తారని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. తాళ్లపూడిలో గురువారం రేషన్ సరకుల పంపిణీని తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన బండారు తుమ్మాలమ్మ, చెక్కా శేషారత్నంకు ఇంటి వద్ద రేషన్ సరకులు అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ, ప్రతి నెలా ఒకటి నుంచి 15లోపు 65 ఏళ్లు నిండిన వృద్ధులకు రేషన్ షాప్ డీలర్లు సరకులు అందజేస్తారన్నారు. సూరయ్యపేటలోని రేషన్‌కార్డుదారులకు అక్కడ కాలనీలో సప్లిమెంటరీ షాప్ ఏర్పాటు చేసి, సరకులు అందజేస్తామని తెలిపారు.



పోలవరం నియోజకవర్గం కొవ్వాడ కాలువపై నిర్మించిన ప్రాజెక్టు



మూడు నియోజకవర్గాల్లో విస్తరించిన కొవ్వాడ కాలువ

కొవ్వాడ.. ముంపు దడ



దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద కాలువ పూడికతీత పనులు

- కాలువ ముంపునకు శాశ్వత పరిష్కారం ఏదీ?
- మూడు నియోజకవర్గాల్లో 70 కి.మీ.
- ఏటా వేలాది ఎకరాల్లో నష్టం
- రైతులకు దక్కని సార్వా వరి పంట
- రూ.3.50 కోట్లతో తాత్కాలిక మరమ్మతులు!

దేవరపల్లి: ఏటా వర్షాకాలంలో వేలాది ఎకరాల పంటను కొవ్వాడ కాలువ వరద ముంచెత్తుతోంది. సార్వాలో వేసిన వరి పంట రైతుల చేతికి అందుతుందనే నమ్మకం ఉండడం లేదు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతం నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువ నీరు ఇరువైపులా పంటలను ముంచెత్తడంతో పంట చేలు ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా దాదాపు ఐదు వేల ఎకరాల్లో చేలు ముంపు బారిన పడుతుండగా, 2,500 నుంచి 3 వేల ఎకరాల పంట దెబ్బతింటోంది. ఇలా మొదటి పంటను రైతులు కోల్పోతున్నారు. రబీ పంటపైనే రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు.

మూడు నియోజకవర్గాల్లో విస్తరించి..

కొవ్వాడ కాలువ పోలవరం, గోపాలపురం, కొవ్వూరు మండలాల్లో సుమారు 70 కి.మీ. మేరకు విస్తరించి ఉంది. కొవ్వూరు నియోజకవర్గంలో తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు మండలాలు, దేవరపల్లి నియోజకవర్గంలో గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో 40 కి.మీ. పొడవున కాలువ విస్తరించి ఉంది. గోపాలపురం మండలంలో చిట్యాల, చెరుకుమిల్లి, వెంకటాయపాలెం గ్రామాల్లో సుమారు 600 ఎకరాలు, దేవరపల్లి మండలంలోని గౌరీపట్నం, కొండగూడెం గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో పంట ఏటా ముంపునకు గురవుతున్నట్టు రైతులు తెలిపారు.

తాత్కాలిక పనులు

కొవ్వాడ ప్రాజెక్టు, గేట్ల మరమ్మతులు, ప్రధాన కాలువ పూడికతీత పనులకు ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేయగా, పనులు జరుగుతున్నాయి. గోపాలపురం నియోజకవర్గానికి రూ.1.03 కోట్లు, కొవ్వూరుకు రూ.1.78 కోట్లు, పోలవరానికి రూ.68 లక్షలు మంజూరయ్యాయి. కొవ్వూరు నియోజకవర్గంలో 25 కి.మీ., పోలవరంలో 12 కి.మీ., గోపాలపురంలో 12 కి.మీ. కాలువ తాత్కాలిక పూడికతీత పనులు చేపట్టారు. ప్రాజెక్టు నిర్మించి సుమారు 20 ఏళ్లు అయింది. అప్పటి నుంచి ప్రాజెక్టు, కాలువ కనీస మరమ్మతులు చేపట్టలేదని రైతులు చెబుతున్నారు.

ముమ్మరంగా పూడికతీత



కాలువ పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మూడు నియోజకవర్గాల్లో 40 కి.మీ. పొడవున పూడికతీత, గట్లు పటిష్టం చేస్తున్నాం. 200 లాజిస్టిక్ 10 మెషీన్లతో పనులు జరుగుతున్నాయి. మరి కొన్ని మెషీన్లు ఏర్పాటు చేస్తున్నాం. వాతావరణం అనుకూలిస్తే పది రోజుల్లో పనులు పూర్తి చేస్తాం. ప్రస్తుతం పది కి.మీ. పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టు వద్ద గేట్ల మరమ్మతులు చేపట్టాం. కొత్త గేట్లు ఏర్పాటు చేస్తున్నాం. కాలువ పూడికతీత, ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు రూ.3.50 కోట్లు మంజూరయ్యాయి. గోపాలపురం నియోజకవర్గంలో ఎనిమిది చెరువుల ఆయకట్టు పంట బోదెల పూడికతీతకు రూ.48 లక్షలు మంజూరయ్యాయి.

– ఎం.రాహుల్ భాస్కర్, ఏఈ, ఇరిగేషన్ శాఖ

సార్వా పంట నష్టపోతున్నాం



ఏటా కాలువ ముంపునకు వరి పంట దెబ్బతింటోంది. సార్వా పంట నష్టపోతున్నాం. కాలువ పూడుకుపోవడం, గుర్రపుడెక్క అల్లుకుపోవడంతో వర్షాకాలంలో వరద నీరు పొలాలపై నుంచి ప్రవహిస్తోంది. గుర్రపుడెక్క పొలాల్లో మేటలు వేస్తోంది. తాత్కాలిక మరమ్మతుల వల్ల ప్రయోజనం లేదు. శాశ్వత మరమ్మతులు చేయాలి. 20 ఏళ్లుగా కాలువ అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామంలో సుమారు 600 ఎకరాల్లో పంట దెబ్బతింటోంది.

– కొర్లపాటి గోపాలం, రైతు, గౌరీపట్నం, దేవరపల్లి మండలం

శాశ్వత మరమ్మతులకు ప్రతిపాదనలు



కొవ్వాడ కాలువ శాశ్వత మరమ్మతులకు రూ.26 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి అందించాం. ఏటా సుమారు 6 వేల ఎకరాలు ముంపునకు గురవుతుంది. నియోజకవర్గంలో ఇరిగేషన్ పనులకు రూ.2 కోట్లు మంజూరు కాగా, రూ.1.03 కోట్ల వ్యయంతో తాత్కాలిక పూడికతీత పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో కొవ్వాడ, ఎర్రకాలువ ప్రధాన నీటి వనరులు. ఎర్రకాలువ శాశ్వత మరమ్మతులకు రూ.200 కోట్ల అంచనాతో బృహత్తర ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. కొవ్వాడ కాలువ పూడికతీత వల్ల ఈ ఏడాది వర్షాకాలంలో రైతులకు తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది.

– మద్దిపాటి వెంకట్రాజు, ఎమ్మెల్యే, గోపాలపురం

ఘనంగా హోమాలు



విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

ఉండ్రాజవరం: తాడిపర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గురువారం యాగశాల వద్ద హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయా విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. శుక్రవారం ఆలయ ప్రారంభోత్సవం, యంత్ర, ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

యోగాతో అన్ని సమస్యలూ దూరం

నిడదవోలు రూరల్: ప్రతి ఇల్లు యోగా కేంద్రంగా మారితే ఆ ఇంట ఆరోగ్య, మానసిక సమస్యలు చాలా వరకు తగ్గిపోతాయని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ అన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలన్నారు. శారీరక, మానసిక ప్రయోజనాలు కలిగించే యోగాపై ప్రజలు విస్తృత అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, కార్యాలయ ఏఓ జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగదీష్ జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి వనిత



జగదీష్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్ జన్మదిన వేడుకల్లో పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయ కర్త తానేటి వనిత పాల్గొన్నారు. యర్నగూడెం ఆర్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం రాత్రి ఈ వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసిన అనంతరం జగదీష్‌ను ఆమె గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదె సుబ్బారావు, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, యువజన విభాగం కార్యదర్శి సత్తి సాయిఈశ్వర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సాలి వేణు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడిబోయిన గంగరాజు, పార్టీ గోపాలపురం మండల అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి, దేవరపల్లి, ద్వారకా తిరుమల మండలాల మహిళా విభాగం కన్వీనర్లు కడలి హైమావతి, మల్లిపూడి నాగమణి, సర్పంచ్ సున్నం వరప్రసాద్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ ముస్తఫా, మాజీ సర్పంచ్ దోనెల్లి జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

‘వెన్నుపోటు దినం’ విజయవంతం

పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు ధన్యవాదాలు



చాగల్లు: సీఎం చంద్రబాబు మోసాలను ఎండగడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొవ్వూరులో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో నియోజకవర్గంలో అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని, విజయవంతం చేసినందుకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హర్షం వ్యక్తం చేశారు. చాగల్లులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ఏడాది పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లటంలో పార్టీ శ్రేణులు విజయవంతమయ్యారని ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి ఎప్పటికప్పుడు తీసుకువెళ్లడంలో పార్టీ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని కోరారు.

అన్నింటా వంచన

రాష్ట్రంలో వైద్యం, వ్యవసాయ రంగాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, ఆరోగ్యశ్రీని అటకెక్కించిందని, రైతన్నలకు పెట్టుబడి సాయం అందించకుండా అప్పులపాలు చేసిందని వెంకట్రావు విమర్శించారు. చదువుకునే పిల్లలు, రైతన్నలు, మహిళలు, నిరుద్యోగులను వంచించిందన్నారు. 2.60 లక్షల మంది వలంటీర్లను రోడ్డున పడేసిందని, ఇంటి వద్దకే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడంతో 9,280 మంది ఆపరేటర్లు వీధుల పాలయ్యారన్నారు. పారదర్శకత కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెచ్చిన జ్యుడీషియల్ ప్రివ్యూ వ్యవస్థ, రివర్స్ టెండరింగ్ వ్యవస్థనూ కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అన్నారని, నేడు సూపర్ స్కామ్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలను అమలు చేస్తే, కూటమి ప్రభుత్వం ఇసుక, మట్టి, మద్యం నుంచి భూ కేటాయింపుల వరకు అన్నింటా అవినీతికి పాల్పడుతోందని విమర్శించారు.

ప్రజల తాగునీటి అవసరాలు తీర్చాలి

పోచవరం, రాగోలపల్లిలో ‘జల్‌జీవన్’ బృందం పర్యటన



పోచవరంలో వివరాలు సేకరిస్తున్న జల్‌జీవన్ మిషన్ బృంద సభ్యులు

తాళ్లపూడి: గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందజేస్తూ, వారి అవసరాలు తీర్చేలా చర్యలు తీసుకోవాలని జల్‌జీవన్ మిషన్ బృంద సభ్యుడు కె.ప్రకాష్ అన్నారు. మండలంలోని పోచవరం, రాగోలపల్లి గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు పరిశీలించేందుకు కేంద్ర బృందం గురువారం పర్యటించింది. గ్రామాల్లోని వాటర్, శానిటేషన్ కమిటీలతో కలిసి ఈ బృందం పలు విషయాలపై చర్చించింది. అనంతరం పోచవరం పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గ్రామానికి కేటాయించిన పనులు వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీ గిరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అనపర్తి ప్రసాద్ తమ గ్రామంలో తాగునీటి అవసరాలను, పైపులైన్, ట్యాంక్ కోసం చేపట్టాల్సిన పనులను వారికి తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా చేసిన పనులు కాకుండా, పంచాయతీ ద్వారా ఎప్పటికప్పుడు మరమ్మతులు, భూమిలో పాడైన పైపులు మారుస్తూనే ఉన్నామని తెలిపారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాకర్ల హేమలత, జల్‌జీవన్ మిషన్ బృంద సభ్యులు జె.శ్రీమన్నారాయణ, ఎ.ప్రవీణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షేక్ సూర్జహాన్, కార్యదర్శి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎంపీపీ కాకర్ల నారాయుడు
- కొవ్వూరు మండల పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నారాయుడు

తాళ్లపూడి(కొవ్వూరు): గ్రామాల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్స్‌తో పలు అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ కాకర్ల నారాయుడు అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో టీబీ వెంకటరమణ సమావేశాన్ని కొనసాగించారు. వివిధ శాఖలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. రైతులకు అందజేస్తున్న పథకాలను ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ శ్రీనివాస్ వివరించారు. సివిల్‌సప్లయ్ డీటీ సునీత మాట్లాడుతూ, కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. మండల ఏఓ గంగాధర్ మాట్లాడుతూ, పీఎం కిసాన్ సొమ్ము కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పక చేయించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ఈ నెలలో ప్రారంభం అవుతుందని తెలిపారు. వ్యవసాయ పరికరాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఏఈ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యుత్ భారం తగ్గించుకోవడానికి సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎంపీపీ నారాయుడు మాట్లాడుతూ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1. 26 లక్షలతో 33 అభివృద్ధి పనులకు, ఎంపీపీ జనరల్ ఫండ్స్ నుంచి రూ.286.65 లక్షలతో 81 పనులకు ఆమోదం తెలిపినట్టు చెప్పారు. జెడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

నిడదవోలు: కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బద్ధ వెంకటరావు డిమాండ్ చేశారు. సంఘ జిల్లా కమిటీ సమావేశం పట్టణంలో గురువారం జరిగింది. వెంకట్రావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీల అమలులో వైఫల్యం చెందారని విమర్శించారు. తక్షణం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్రకృతిని కాపాడడం అందరి బాధ్యత

- ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్
- పర్యావరణ దినోత్సవంలో మొక్కలు నాటిన ప్రముఖులు



కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న జడ్జి సాయికృష్ణ



నిడదవోలులో మొక్క నాటుతున్న చైర్మన్ ఆదినారాయణ

పెరవలి: మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పెరవలి మండలంలోని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, కాల్వ గట్లు, రోడ్ల పక్కన ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ, సకాలంలో వర్షాలు కురవాలన్నా, ప్రకృతి సక్రమంగా ఉండాలన్నా మొక్కలు ప్రధాన భూమిక వహిస్తాయన్నారు. ఎంపీడీఓ పద్మజ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 1,260 మొక్కలు పంపిణీ చేశామన్నారు. డ్వాక్రా ఏపీఎం బి.రామకృష్ణ, తహసీల్దార్ డి.అచ్యుతకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉపాధి కూలీలు

దేవరపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉపాధి హామీ పథకంలో మండలంలోని 15 పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణ రావు జెడ్పీ స్కూలు ఆవరణలో సర్పంచ్ కడిమి వీరకుమారి తదితరులు మొక్కలు నాటారు. సంగాయగూడెం పంచాయతీ వద్ద సర్పంచ్ కరుటూరి స్వరూపరాణి, దుద్దుకూరు పంచాయతీ వద్ద ఉప సర్పంచ్ కొలుకులూరి రవికుమార్ మొక్కలు నాటారు. అన్ని గ్రామాల్లో 2,500 మొక్కలు నాటినట్టు ఏపీఓ జీవీ శ్రీనివాస్ తెలిపారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తేనే..

నిడదవోలు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్లాస్టిక్ వాడకం నిషేధంతోనే సాధ్యమవుతుందని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ అన్నారు. సమిశ్రగూడెంలోని ఎంపీడీఓ కార్యాలయం, చెర్వుగట్టు వద్ద మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచ్ ఎండీ అక్రం, నాయకులు పాల్గొన్నారు. తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయం వద్ద ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సహాయ కమిషనర్, ఈఓ వి.హరి సూర్యప్రకాష్ మొక్కలు నాటారు.

మానవ మనుగడకు..

తాళ్లపూడి: మొక్కలు నాటితేనే భవిష్యత్తులో మానవుని మనుగడ ఉంటుందని ఎంపీపీ పోసిరాజు అన్నారు. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వేగేశ్వరపురం పంచాయతీలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు మొక్కలు నాటారు. పెద్దేవం పంచాయతీ వద్ద సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, కార్యదర్శి బి.సాంబమూర్తి పాల్గొన్నారు. పలు గ్రామాల్లో సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో..

తాళ్లపూడి:(కొవ్వూరు): పర్యావరణాన్ని పరిశుభ్రంగాఉంచుకుని, కాలుష్యాన్ని తగ్గించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ అన్నారు. మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వూరు కోర్టు పరిసరాల్లో మొక్కలు నాటారు. బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ వి.నాగముడు, ఏపీపీ కె.గోపాలకృష్ణ, న్యాయవాదులు చలపతి, ప్రకాష్, శ్రీవల్లీ, ప్రభాకరరావు, శ్రీను పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఉండ్రాజవరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో వీవీవీ రామారావు అన్నారు. పాలంగిలో చెత్త సంపద తయారీ కేంద్ర వద్ద మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ విధిగా చెట్లను పెంచాలని కోరారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ ఆంజనేయశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఏ.కాంతరావు, కార్యదర్శి హసన్ జానీ, సచివాలయ సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. అలాగే ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో మొక్కలు నాటారు.

మొక్కలను సంరక్షించాలి

నిడదవోలు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కోరారు. పట్టణంలోని గణపతి సెంటర్ నుండి గణేష్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం శశి స్కూల్ రోడ్డు, ఎంపీ నగర్ పార్కులో మొక్కలు నాటారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షేక్ వజీరుద్దీన్, కౌన్సిలర్ పువ్వల రతీదేవి, డీఈఈ డి.సత్యన్నారాయణ పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ బి.మేరీ సుజాత ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



బియ్యపుగుంట చెరువును పరిశీలిస్తున్న సత్యనారాయణ, కౌన్సిలర్లు

నిడదవోలు: పట్టణంలోని బాలాజీ నగర్‌లో మున్సిపల్ స్థలం బియ్యపుగుంట చెరువు పూడ్చివేసిన రియల్ ఎస్టేట్ ఆక్రమణదారులపై అధికారులు చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. పట్టణంలో ఆక్రమణలకు గురైన బియ్యపుగుంట చెరువు ప్రాంతాన్ని గురువారం పార్టీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు రాత్రికి రాత్రే మట్టి తరలించి చెరువును పూడ్చివేస్తున్నా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రైతులు పశువులకు ఉపయోగపడే చెరువును సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. స్థానిక రైతులు రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఇంతవరకూ చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. రెండేళ్ల క్రితం మున్సిపాలిటీ అధికారులే సరిహద్దు పోల్స్‌ని కూడా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. రూ.కోట్ల విలువైన మున్సిపల్ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి సంరక్షించాలని, తక్షణమే రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎలగాడ బాలరాజు, కౌన్సిలర్లు ఆకుల ముకుందరావు, దాకే అనిల్‌కుమార్, పార్టీ నాయకులు తోలేటి కోటేశ్వరరావు, ఆలమూరు రాజశేఖర్, పాలా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ నిడవోలు రూరల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు. అట్లపాడు, సమిశ్రగూడెం, గోపవరం, విజ్జేశ్వరం, పురుషోత్తపల్లి, పందలపర్రు, డి.ముప్పవరం, కలవచర్ల, జీడిగుంట, కోరుపల్లి, మునిపల్లి, పెండ్యాల గ్రామాఅంతరాయం కలుగుతుందన్నారు.

రేపు పల్లంట్లలో..

దేవరపల్లి: పల్లంట్ల 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా 11కేవీ పల్లంట్ల అగ్రికల్చర్ ఫీడర్ బైఫర్‌గేషన్ కోసంకొత్తగా ఫీడర్ ఏర్పాటు, గ్రామంలో 11 కేవీ విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఆపరేషన్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పల్లంట్లలో గృహ, వ్యవసాయ సర్వీసులకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.